# ఈ రోజే గొప్ప ప్రారంభం

నవతరం
తెలుగు దినపత్రిక

## ది చెన్నయ్ షాపింగ్ మాల్ ®

## ఇప్పుడు మన కాకినాడలో



మే 9న
అంగరంగ వైభవంగా
శుభారంభం

ప్రముఖ సినీతార
కుమారి మృణాల్ ఠాకూర్ గారి
చేతుల మీదుగా
ఉ.10.30 ని॥లకు



అత్యద్భుత
ప్రారంభోత్సవ
ఆఫర్స్

కాస్ట్‌టు
కాస్ట్ సేల్

వాలెట్
పార్కింగ్
సౌకర్యం కలదు

శారీస్ | ఉమెన్స్‌వేర్ | మెన్స్‌వేర్ | కిడ్స్‌వేర్

తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మహారాష్ట్ర | కర్ణాటక

మెయిన్ రోడ్, కాకినాడ

# ఖరీఫ్ రైతుకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



- రైతులకు సమృద్ధిగా విత్తనాలు, ఎరువులు, సాగునీరు
- ముందస్తు ప్రణాళికతో వ్యవసాయ రంగానికి పూర్తి మద్దతు
- మే 15 నుంచే దశలవారీగా సాగునీటి విడుదల
- రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమగ్ర ఏర్పాట్లు
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**నవతరం -అమరావతి**

రాష్ట్రంలో ఖరీఫ్-2026 సీజన్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు వ్యవసాయశాఖ సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సాగునీరు సమయానికి అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. 2026-27 సంవత్సరానికి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా రూ.294 కోట్ల బడ్జెట్‌తో 7.46 లక్షల క్వింటాళ్ల విత్తనాలను రైతులకు రాయితీపై సరఫరా చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించడం ద్వారా అధిక దిగుబడులు సాధించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఖరీఫ్--2026 సీజన్‌కు అవసరమైన 93 వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువు విత్తనాలను గత సంవత్సరాల మాదిరిగానే 50 శాతం రాయితీపై సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే 30 వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను సేకరించి రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీకి సిద్ధం చేసినట్లు చెప్పారు. మిగిలిన అవసరాల కోసం టీజీఎస్ డీసీ, హెచ్‌ఐఎల్, ఎన్ఎస్ సీ, ఆంగ్రూ సంస్థల ద్వారా అదనపు విత్తనాల సేకరణ చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది 2.20 లక్షల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను 40 శాతం రాయితీపై పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. వేరుశనగ విత్తనాల సేకరణకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయిందని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మే 20 నుంచి రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ ప్రారంభమవుతుందని చెప్పారు. అలాగే 1.62 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలను మే 15 నుంచి రాయితీపై రైతులకు అందజేయనున్నట్లు వెల్లడించారు. చిరుధాన్యాలు, అపరాలు తదితర ఇతర విత్తనాలను జూన్ 15 నుంచి రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఏపీ సీడ్స్ ద్వారా సరఫరా చేసే ప్రతి విత్తనాన్ని సంబంధిత ప్రయోగశాలల్లో నాణ్యతా పరీక్షలు నిర్వహించిన తరువాత మాత్రమే రైతు సేవా కేంద్రాలకు పంపిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలే అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. 2025-26 సంవత్సరం నుంచి గ్రామీణ విత్తనోత్పత్తి పథకానికి ప్రత్యామ్నాయంగా కొత్త విత్తన రకాల పెంపొందించడానికి తోడ్పాటు అనే సవరించిన సమగ్ర పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 1,03,901 క్వింటాళ్ల విత్తనోత్పత్తి జరిగిందని, 2026-27 సంవత్సరానికి 1,20,678 క్వింటాళ్ల

-మిగతా 2లో

---

# రక్తదానంతో సేవా స్ఫూర్తి చాటనున్న సిక్కోలు సైనికుడు

- పవన్ కళ్యాణ్ ఆరోగ్యం కోసం ప్రత్యేక ప్రార్థనలు
- సింహాచలం వరకు కాలినడకన వెళ్లి దర్శనం
- వేసవిలో రక్త కొరత నివారణకు ఆదివారం రక్తదాన శిబిరం
- జనసైనికులు, యువత పాల్గొనాలని పిలుపు

**నవతరం -శ్రీకాకుళం**

అరసవిల్లి ఆదిత్య నగర్ 7వ లైన్‌కు చెందిన సైనికుడు ్న సిక్కోలు సైనికుడు కాకర్ల నర్సింగ్ సేవా కార్యక్రమాలతో స్థానికంగా ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ప్రజల్లో సేవాభావాన్ని పెంపొందించే కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు.ఇటీవల పవన్ కళ్యాణ్ ఆరోగ్యం కుదుటపడాలని ఆకాంక్షిస్తూ శ్రీకాకుళం నుంచి సింహాచలం వరకు నలుగురు కలిసి దాదాపు 33 గంటలపాటు కాలినడకన ప్రయాణించి శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరిగి శ్రీకాకుళం చేరుకుని సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.ఈ వేసవిలో రక్త కొరత తీవ్రంగా ఉన్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు అండగా నిలిచేందుకు రక్తదాన శిబిరాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు కాకర్ల నర్సింగ్ తెలిపారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆరోగ్యం కుదుటపడాలని కోరుకుంటూ, ఆయన ఆశయ సాధనలో భాగంగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు.జనసైనికుల సహకారంతో ఆదివారం ఉదయం 10 గంటలకు అరసవిల్లి ఆదిత్య నగర్ 7వ లైన్‌లోని జనసేన కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కోరారు.




---

# సేవాపథంలో రెడ్ క్రాస్ ఆదర్శం

**నవతరం -శ్రీకాకుళం**

మానవతా దృక్పథంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలు సమాజానికి దిక్సూచిలా ఉన్నాయని జిల్లా రెవెన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు కొనియాడారు. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం, ప్రపంచ థలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు సర్ జీన్ హెన్రీ డ్యూనెంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

థలసేమియా వ్యాధి నివారణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఆర్ అండ్ బి బంగ్లా నుండి బాదుల్ పేట వరకు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ.. థలసేమియా నివారణకు ముందస్తు జాగ్రత్తలు అవసరమని, రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బాధితులను ఆదుకోవాలని పిలుపునిచ్చారు.

జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ పి. జగన్మోహన్ రావు మాట్లాడుతూ.. రక్తదాన శిబిరాలు, పౌష్టికాహార కిట్ల పంపిణీ ద్వారా బాధితుల్లో భరోసా కల్పిస్తున్నామని, భవిష్యత్తులో జిల్లాను థలసేమియా రహితంగా మార్చేందుకు కృషి




చేస్తున్నామని తెలిపారు.

కార్యక్రమంలో భాగంగా సేవా రంగంలో ప్రతిభ కనబరిచిన ఉత్తమ సిబ్బందికి డీఆర్ఓ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

ప్రముఖ వైద్యులు డాక్టర్ గోండు గంగాధర్ రావు, డాక్టర్ మూల వెంకట్రావు మాట్లాడుతూ రెడ్ క్రాస్ ద్వారా అందుతున్న ఉచిత రక్తమార్పిడి, మందులు, పరీక్షల సదుపాయాలు బాధితులకు ఎంతో మేలు చేకూరుస్తున్నాయని ప్రశంసించారు.

జిల్లా కార్యదర్శి బి. మల్లేశ్వరరావు మాట్లాడుతూ సంస్థ ప్రగతిలో వాలంటీర్ల కృషి వెలకట్టలేనిదన్నారు.

ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు కనుగుల దుర్గ శ్రీనివాసరావు, పి. శ్రీకాంత్, ఎం. కళ్యాణ్ చక్రవర్తి, పి. వైకుంఠరావు, ప్రతినిధులు కె. సత్యనారాయణ, జి. రమణ, బి. సతీష్ కుమార్, పి. చైతన్య కుమార్, సాయి, నర్సింగరావు, గుణాకర రావు, పేట్రన్స్, వైస్ పేట్రన్స్, సీనియర్ సిటిజన్ సంఘం సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

---

నవతరం
RNI NO. APTEL/2014/58326
తెలుగు దినపత్రిక
సంపుటి : -13 సంచిక : 171 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
09-05-2026 శనివారం వెల : 1 /- పేజీలు : 4

# మహనీయుల ఆశయాలు ఉద్యోగులకు స్ఫూర్తిదాయకం

## సి.ఎమ్.డి. ఇమ్మాది పృధ్వితేజ్

**నవతరం -శ్రీకాకుళం**

మన దేశ గమనాన్ని మార్చిన మహనీయులు ప్రతి ఉద్యోగికి నిరంతర ఆదర్శప్రాయులని, వారి అడుగుజాడల్లో నడవడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఏపీఈపీడీసీఎల్ సి.ఎమ్.డి. ఇమ్మాది పృధ్వితేజ్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం శ్రీకాకుళం సర్కిల్ కార్యాలయం 'విద్యుత్ భవన్' ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన దేశ నాయకుల కాంస్య విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సి.ఎమ్.డి. మాట్లాడుతూ.. సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావ్ పూలే, రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్, జాతిపిత మహాత్మా గాంధీ, ఇంజనీరింగ్ రంగ దిగ్గజం మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాలను ఇక్కడ ప్రతిష్ఠాపన చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ మహనీయుల జీవితాలు ప్రతి ఉద్యోగికి కర్తవ్య పాలనలో స్ఫూర్తినిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) సూర్యప్రకాష్, శ్రీకాకుళం సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

---

# ఈ-ఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రి అచ్చెన్నాయుడు సరికొత్త రికార్డు

- గంటల్లో ఫైళ్ల పరిష్కారం.. మంత్రి అచ్చెన్న పనితీరుకు సీఎం చంద్రబాబు ప్రశంసలు
- పారదర్శకత, వేగం, సమర్థత.. మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేకత

**నవతరం -అమరావతి**

ఈ-ఫైళ్ల క్లియరెన్స్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అసాధారణ వేగం ప్రదర్శిస్తూ పరిపాలనలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతున్నారు. ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఆయన తీసుకుంటున్న చర్యలు ప్రభుత్వ యంత్రాంగంలో చురుకుదనాన్ని పెంచుతున్నాయి. గతంలో ఈ-ఫైళ్ల క్లియరెన్స్‌కు సుమారు 5 గంటల సమయం తీసుకున్న మంత్రి అచ్చెన్నాయుడు, ప్రస్తుతం భారీ స్థాయిలో ఫైళ్లు వచ్చినప్పటికీ సరాసరి కేవలం 2 గంటల 49 నిమిషాల వ్యవధిలోనే ఫైళ్లను డిస్పోజ్ చేస్తుండటం పరిపాలనా సామర్థ్యానికి నిదర్శనమని అధికారులు వెల్లడించారు.

ఈ-ఫైళ్ల క్లియరెన్స్‌ను రోజుల వ్యవధి నుంచి గంటల వ్యవధిలోకి తీసుకురావడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతృప్తి వ్యక్తం చేశారు. పరిపాలనలో వేగం, పారదర్శకత, ప్రజా ప్రయోజనాల పట్ల



కట్టుబాటుతో ముందుకు సాగుతున్న మంత్రి అచ్చెన్నాయుడి పనితీరును సీఎం ప్రత్యేకంగా అభినందించారు. మంత్రి అచ్చెన్నాయుడు నాయకత్వంలో వ్యవసాయ, అనుబంధ శాఖల పరిపాలన మరింత సమర్థవంతంగా మారుతోందని, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలనే ప్రభుత్వ సంకల్పాన్ని ఆయన కార్యాచరణ స్పష్టంగా ప్రతిబింబిస్తోందని అధికారులు పేర్కొన్నారు.

---

# కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

**నవతరం -శ్రీకాకుళం**

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సదస్సు రెండవ రోజు సమావేశంలో శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు, శాంతిభద్రతలు తదితర అంశాలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించి



సంబంధిత అధికారులకు పలు దిశానిర్దేశాలు చేశారు.

ఎడిటోరియల్

# పశ్చిమాసియాలో శాంతి దోబూచులాట!

ఒకవైపు ఇరాన్‌తో యుద్ధం ముగిసిందంటారు, మరోవైపు శాంతి ఒప్పందం కుదరలేదంటారు. మేం చెప్పినట్లుగా వినకపోతే పెద్దఎత్తున తిరిగి దాడులు చేస్తామంటూ ఇంకోవైపు బెదిరిస్తుంటారు. అసలు యుద్ధమే లేదంటూ తమ పార్లమెంటును తప్పుదారి పట్టించారు. లెబనాన్ మీద దాడులను కూడా ఆపాలన్న ఇరాన్ డిమాండ్‌ను పట్టించుకోని అమెరికా ప్రతిరోజూ ఇజ్రాయిల్‌తో జరిపిస్తూనే ఉంది.తాను ప్రారంభించిన ప్రాజెక్టు ఫ్రీడమ్‌ను రెండురోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించాడు. హోర్ముజ్ జలసంధిలో చిక్కుకు పోయిన నౌకలకు దారి చూపి గమ్యస్థానాలకు పంపటానికి పెట్టిన పేరు అది. కాల్పుల విరమణకు ప్రకటించిన నెల రోజుల విరామం గురువారం నాటితో ముగిసిపోయింది.ఈ లోగా పాత అంశాలకే కొన్ని మార్పులు చేసి ఇరాన్ కొత్త ప్రతిపాదనలపేరుతో మధ్యవర్తి పాకిస్తాన్‌కు అందచేసింది. వాటిని పరిశీలిస్తున్నా మంటూనే తమతో ఒప్పందానికి రాకపోతే.....తాట తీస్తానంటూ ట్రంప్ పపాటలే పాడుతున్నాడు. ఒప్పందం కుదుర్చుకొనే పరిస్థితి మరింత మెరుగైందని అదే నోటితో చెబుతాడు. అతగాడు ఎన్ని పిల్లి మొగ్గలు వేసినా ఈ పరిస్థితిలో మార్పులేదు. ఐరోపాలోని అమెరికా మిత్రదేశాలన్నీ మరింతదూరం జరుగుతున్నాయి తప్ప చేయూత అందించేందుకు సిద్ధపడటం లేదు. ఇరాన్ సంక్షోభంలో అనేక దేశాల్లో ఆర్థిక పరిస్థితి అతలాకుతలమవుతున్నది, జనాల మీద ఇంధన భారం విపరీతంగా పెరుగుతున్నది. ఇదిలా ఉండగా బుధవారం నాడు ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అర్ఘాచీ చైనా సందర్శించి అక్కడి నేతలతో తాజాపరిస్థితి గురించి చర్చించటం ప్రాధాన్యత సంతరించుకుంది. వాషింగ్టన్ ఎన్ని బెదిరింపులకు పాల్పడినా వెన్నుదన్నుగా నిలుస్తున్న చైనాను ఇరాన్ నమ్ముతున్నది. ఒప్పందం కుదుర్చుకొనేందుకు ఇరాన్ ప్రతిపాదించిన పద్నాలుగు అంశాలపై రెండు పక్షాలూ క్రమంగా దిగివచ్చేందుకు ప్రాతిపదిక ఉన్నట్లు అమెరికా మీడియా సంస్థలు చెప్పిన కథనాలతో బ్రెంట్ ముడి చమురు ధర 98 డాలర్లకు తగ్గింది.రెండు రోజుల పాటు బలవంతంగా నౌకల విముక్తి పథకాన్ని నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటన కూడా దీనికి దోహదం చేసింది. యురేనియం శుద్ధిని కొంతకాలం వాయిదా వేసేందుకు ఇరాన్ అంగీకరిస్తే దాని మీద విధించిన ఆంక్షల ను క్రమంగా సడలించటంతో పాటు, స్తంభింపచేసిన ఇరాన్ నిధులను కూడా విడుదల చేసేందుకు అమెరికా సుముఖంగా ఉందని ఊహాగానాలు వెలువడ్డాయి.యురేనియం శుద్ధి హక్కును తాము వదలుకొనేది లేదని తప్ప అణ్వాయుధాలను తయారు చేస్తామని ఇరాన్ ఇంతవరకు ఎప్పుడూ చెప్పలేదు. అణ్వస్త్రవ్యాప్తి నిరోధక ఒప్పందానికి (ఎన్‌పిటి) కట్టుబడే ఉన్నామని అంటోంది. ప్రపంచంలో అతిపెద్ద సైనిక శక్తిగా ఉన్న అమెరికా ఇప్పుడేం చేస్తున్నది? ఫిబ్రవరి 28న ఇరాన్‌పై దాడులను ప్రారంభించటమైతే చేసింది గానీ, ఇప్పుడు ఆ సంక్షోభం నుంచి బయటపడటానికి అమెరికా నానా ఇబ్బందులు పడుతున్నది. చెప్పుకోరాని చోట దెబ్బతగిలితే ఎవరికైనా ఎలా ఉంటుందో ట్రంప్‌ది అదే స్థితి. ఇరాన్ ప్రతిదాడుల్లో జరిగిన నష్టం గురించి చెప్పుకోలేదు, అలాగని దాచుకోలేదు. గల్ఫ్‌లోని పదిహేను అమెరికా మిలిటరీ కేంద్రాలలో 228 కట్టడాలు, ధ్వంసమైన పరికరాలకు సంబంధించి ఇటీవల ఇరాన్ కొన్ని చిత్రాలను విడుదల చేసింది. వాటిలో విమానాలను నిలిపే ప్రాంతాలు, చమురు డిపోలు,విమానాలు, రాడార్లు, సమాచార వ్యవస్థల వంటివి ఉన్నాయి. ఇంతవరకు ఆ చిత్రాలు తిమ్మినిబమ్మిని చేసి చూపినవిగా లేదా కృత్రిమ సృష్టి అని చెప్పలేక అమెరికా ఏవేవో పిట్టకథలను చెబుతున్నది.ఎవరెన్ని చెప్పినా ఇరాన్ గురిచూసి దెబ్బతీసిందని దాడుల సమయంలోనే వార్తలొచ్చినందున అలాంటి కథలను నమ్మాల్సిన అవసరం లేదు. ట్రంప్ చెప్పి నట్లుగా మరిన్ని దాడులకు పాల్పడితే ఇదే మాదిరి పరాభవం ఎదురుకావచ్చనే హెచ్చరికలే భూతల దాడులకు దిగకుండా అమెరికా మిలిటరీ జాగ్రత్తపడుతున్నదని చెప్పవచ్చు. ఇరాన్‌పై దాడులతో తమకు 25బిలియన్ డాలర్ల మేర నష్టం వచ్చినట్లు రక్షణశాఖ కబుర్లు చెబుతున్నది. కానీ, ఇది 50బిలియన్ డాలర్లకు పైమాటే ఉంటున్నట్టు తెలుస్తోంది. వర్తమాన సంవత్సరంతో పోల్చితే 42శాతం పెంచి వచ్చే ఏడాది రక్షణ బడ్జెట్‌ను 1.5లక్షల కోట్ల డాలర్లకు పెంచాలని ప్రతిపాదిస్తున్నారంటే ఎంతగా దెబ్బతిన్నదో చూడవచ్చు. పశ్చిమాసియా, మధ్య ప్రాచ్య ప్రాంతంలో జరిగిన నష్టాలకు సంబంధించిన చిత్రాలను విడుదల చేయవద్దని వాణిజ్య ఉపగ్రహ కంపెనీలను ట్రంప్ యంత్రాంగం ఆదేశిం చిందంటేనే అది ఎంతగా మూసిపెడుతోందో తెలుస్తోంది. ఇరాన్ విడుదల చేసిన చిత్రాలు చైనా, రష్యా ఉపగ్రహాలు తీసినవని వేరే చెప్పనవసరం లేదు. ఎందుకంటే టెహరాన్‌కు అలాంటి వ్యవస్థలు లేవు. గురిచూసి అమెరికా లక్ష్యాలను దెబ్బతీయటం కూడా ఆయా దేశాలం దించిన సమాచారం, ఐరోపా సంస్థలు విడుదల చేసిన సమాచారం, చిత్రాలతోనే సాధ్యమైంది. పిల్లి చెలగాటం ఎలుకలకు ప్రాణ సంకటం అన్నట్లుగా అమెరికా వైఖరి మనతో సహా అనేక దేశాలకు ఇబ్బందులను తెస్తున్నది. అందువలన ఇరాన్ న్యాయమైన డిమాండ్లను అంగీకరించి శాంతి ఒప్పందం కుదుర్చుకోవాలని యావత్ ప్రపంచం వత్తిడి తేవాల్సి ఉంది!

# "ఓటు వేసిన చేతులు... ఎందుకు మౌనంగా ఉన్నాయి?"




రాత్రి తొమ్మిది గంటలు. గ్రామం చివర చిన్న టీ దుకాణం. టీవీలో పెద్ద పెద్ద రాజకీయ చర్చలు జరుగుతున్నాయి. ఒక నాయకుడు మరో నాయకుడిపై అరుస్తున్నాడు. "వాళ్లు దొంగలు!" "మీరు దేశాన్ని నాశనం చేశారు!" టీ దుకాణం దగ్గర కూర్చున్న వాళ్లు టీవీని చూస్తున్నారు. కానీ వారి ముఖాల్లో ఆసక్తికంటే అలసట ఎక్కువగా కనిపిస్తోంది.

అక్కడే మూలన కూర్చున్నాడు రామయ్య. అరవై ఏళ్ల రైతు. చేతులు పగిలిపోయాయి. కళ్లలో నిద్ర లేదు. పక్కనే అతని కొడుకు సురేష్. డిగ్రీ పూర్తి చేశాడు. రెండేళ్లుగా ఉద్యోగం కోసం తిరుగుతున్నాడు.

టీ దుకాణం యజమాని టీవీ వాల్యూమ్ పెంచాడు. "మా ప్రభుత్వం ప్రజల కోసం రాత్రింబవళ్లు పనిచేస్తోంది!" అని ఒక నాయకుడు అరిచాడు. రామయ్య ఒక్కసారిగా నవ్వాడు. ఆ నవ్వులో ఆనందం లేదు... బాధ ఉంది. "మన కోసం పని చేస్తే... నా పొలం అప్పుల్లో ఎందుకు మునిగిపోయింది?" అని మెల్లగా అడిగాడు. అక్కడున్నవాళ్లు ఒక్కసారిగా మౌనంగా మారిపోయారు.

సురేష్ టీవీ వైపు చూస్తూ అన్నాడు: "నాన్నా... ప్రతి ఐదు సంవత్సరాలకు కొత్త వాళ్లు వస్తారు. మాటలు మారతాయి. జెండాలు మారతాయి. కానీ మన బతుకు ఎందుకు మారడం లేదు?"

ఆ మాట విన్న దగ్గరున్న ఆటోడ్రైవర్ రాజు కూడా మాట్లాడాడు. "ఎన్నికలప్పుడు మాత్రం మనమే రాజులు. మన ఇంటి దగ్గరకు వస్తారు. చేతులు కలుపుతారు. 'అన్నా... మీ కుటుంబం మా కుటుంబం' అంటారు. గెలిచాక? రోడ్డు మీద కనిపించినా కారు అద్దం కూడా దిగడు."

టీ దుకాణం దగ్గర నిశ్శబ్దం పెరిగింది. టీవీలో ఇంకా అరుపులే. ఒక నాయకుడు "ప్రతిపక్షం రాష్ట్రాన్ని నాశనం చేస్తోంది!" అని అరిచాడు. మరో నాయకుడు "పాలకవర్గం దోచుకుంటోంది!" అన్నాడు. అప్పుడు అక్కడ కూర్చున్న పాఠశాల ఉపాధ్యాయుడు శేఖర్ నెమ్మదిగా అడిగాడు: "ఒక్కసారి ఆలోచించండి... పాలకవర్గం పని ఏమిటి? ప్రజలకు సేవ చేయడం కాదా? ప్రతిపక్షం పని ఏమిటి? ప్రభుత్వాన్ని ప్రశ్నించడం కాదా? అయితే ఇప్పుడు ఏమవుతోంది? వాళ్లు వీళ్లను తిడుతున్నారు... వీళ్లు వాళ్లను తిడుతున్నారు... మధ్యలో ప్రజల జీవితం మాత్రం సినిమా సీన్‌లా చూస్తూ పోతోంది."

ఎవ్వరూ సమాధానం చెప్పలేదు. అంతలో టీ దుకాణం బయట ఓ చిన్న పిల్లవాడు స్కూల్ బ్యాగ్ వేసుకుని నడుస్తూ కనిపించాడు. చిరిగిన చెప్పులు. కానీ కళ్లలో పెద్ద కలలు. సురేష్ ఆ పిల్లవాడిని చూస్తూ అడిగాడు: "రేపు వీళ్ల భవిష్యత్తు ఏమిటి? ఇవాళ మనం ప్రశ్నించకపోతే... రేపు వీళ్లు కూడా మనలాగే టీ దుకాణం దగ్గర కూర్చుని అదే బాధ మాట్లాడుకోవాలా?"

రామయ్య కళ్లలో నీళ్లు కనిపించాయి. "మనం కూడా తప్పు చేశాం బాబూ..." అన్నాడు. "ఎన్నికలప్పుడు కులం చూసాం. డబ్బు చూసాం. పార్టీ చూసాం. కోపంతో ఓటు వేసాం. కానీ పని అడగలేదు."

టీ దుకాణం యజమాని టీవీ ఆఫ్ చేశాడు. ఆ ఒక్క క్షణంలో అక్కడ నిశ్శబ్దం కాదు... ఒక నిజం వినిపించింది. ప్రజాస్వామ్యం అంటే ఐదు సంవత్సరాలకు ఒక్కసారి ఓటు వేయడం మాత్రమే కాదు. ఓటు వేసిన తర్వాత కూడా ప్రశ్నించడం. "రోడ్డు ఎక్కడ?" "ఉద్యోగం ఎక్కడ?" "ఆసుపత్రి ఎందుకు లేదు?" "పాఠశాలలో టీచర్లు ఎందుకు లేరు?" అని అడగడం. ఎందుకంటే నాయకుడు రాజు కాదు. ప్రజల చేత ఎన్నుకోబడిన బాధ్యతగల వ్యక్తి.

ఆ రాత్రి అందరూ ఇంటికి వెళ్లిపోయారు. కానీ సురేష్ మాత్రం ఆలోచిస్తూ నిలబడ్డాడు. "దేశాన్ని మార్చేది ఒక్క నాయకుడా? లేక ప్రశ్నించడం మొదలుపెట్టిన ప్రజలా?" ఆ ప్రశ్న ఇంకా గాలిలోనే ఉంది... ఇప్పుడు ఆ ప్రశ్న మీ ముందుంది. ఓటు వేసిన తర్వాత మీరు ప్రశ్నిస్తున్నారా? నాయకుడిని అభిమానిగా చూస్తున్నారా... లేక బాధ్యతగల వ్యక్తిగా? మీ పిల్లల భవిష్యత్తు గురించి నిజంగా ఆలోచిస్తున్నారా? లేక సోషల్ మీడియాలో తిట్టి మళ్లీ మౌనంగా మారిపోతున్నారా? ఎందుకంటే... ప్రజలు మౌనంగా ఉన్నంతకాలం రాజకీయాలు మారవు.

ప్రజల ప్రశ్న :
తేరాల రాజేంద్ర ప్రసాద్ గుప్తా

# ఖరీఫ్ రైతుకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

విత్తనోత్పత్తి లక్ష్యంగా ప్రణాళిక రూపొందించామని చెప్పారు. గత ప్రభుత్వం 2019-20 నుంచి 2023-24 వరకు రాయితీ విత్తనాలు సరఫరా చేసిన సంస్థలకు రూ.476.94 కోట్ల బకాయిలు ఉంచిందని మంత్రి విమర్శించారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి సంబంధించిన పూర్తి చెల్లింపులు ఇప్పటికే విడుదల చేసిందని, 2025-26 సంవత్సరానికి సంబంధించిన చెల్లింపుల ప్రక్రియ కూడా కొనసాగుతోందని తెలిపారు. రైతులకు వివిధ పంటలపై ఆకర్షణీయమైన రాయితీలు కొనసాగిస్తున్నామని మంత్రి వెల్లడించారు. వరి విత్తనాలకు జిల్లాల వారీగా క్వింటాల్‌కు రూ.500 నుంచి రూ.1000 వరకు రాయితీ, చిరుధాన్యాలకు 50 శాతం, పప్పుధాన్యాలకు 30 శాతం, శనగలకు 25 శాతం, వేరుశనగ మరియు నువ్వులకు 40 శాతం, పచ్చిరొట్ట ఎరువు విత్తనాలకు 50 శాతం రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. ఏజెన్సీ మండలాల్లో గిరిజన రైతులకు 90 శాతం వరకు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో 80 శాతం వరకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

ఖరీఫ్ సీజన్‌కు ఎరువుల కొరత లేదు

రాష్ట్రంలో ఖరీఫ్-2026 సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని రైతులకు అవసరమైన ఎరువులను సమృద్ధిగా అందుబాటులో ఉంచామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రానికి ఖరీఫ్ 2026 సీజన్‌కు మొత్తం 18.09 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల కేటాయింపు ఉండగా, మే నెల వరకు ఇప్పటికే 3.44 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించబడినట్లు మంత్రి వెల్లడించారు. ఏప్రిల్ 1 నాటికి 7.13 లక్షల మెట్రిక్ టన్నుల ప్రారంభ నిల్వలు ఉండగా, ఇప్పటివరకు మరో 1.71 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు రాష్ట్రానికి చేరాయని తెలిపారు. దీంతో మొత్తం 8.84 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులోకి వచ్చినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు 1.08 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులకు విక్రయించగా, ప్రస్తుతం రాష్ట్రంలో 7.77 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని మంత్రి వివరించారు. యూరియా 2.40 లక్షల మెట్రిక్ టన్నులు, డీఏపీ 0.94 లక్షల మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 0.35 లక్షల మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 3.62 లక్షల మెట్రిక్ టన్నులు, ఎస్-ఎస్‌పీ 0.46 లక్షల మెట్రిక్ టన్నుల మేర అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతుల అవసరాలను ముందుగానే అంచనా వేసి కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ఎరువుల సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. జిల్లాల వారీగా నిల్వలు, సరఫరాపై అధికారులను అప్రమత్తంగా ఉండాలని ఆదేశించినట్లు చెప్పారు. ఎక్కడైనా కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు అధీకృత ఎరువుల దుకాణాల నుంచే ఎరువులను కొనుగోలు చేయాలని, అధిక ధరలకు కొనవద్దని మంత్రి సూచించారు. రైతులకు అవసరమైన ప్రతి ఎరువు సమయానికి అందేలా ప్రభుత్వం పూర్తి స్థాయిలో చర్యలు చేపడుతోందని ఆయన స్పష్టం చేశారు.

సాగుకు సమగ్ర నీటి ప్రణాళిక సిద్ధం

ఖరీఫ్--2026 సీజన్‌కు రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి సరఫరాపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. రైతులకు సమయానికి సాగునీరు అందించేందుకు నీటిపారుదల శాఖతో సమన్వయం చేస్తూ సమగ్ర ప్రణాళిక అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రధాన, మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో నీటి లభ్యత, జలాశయాల్లో నిల్వలు, కాలువల మరమ్మతులు, ఖరీఫ్ అవసరాలను సమీక్షించిన అనంతరం మే 15 నుంచి దశలవారీగా సాగునీటి విడుదలకు ప్రభుత్వం సిద్ధమైందని మంత్రి వెల్లడించారు. ఖరీఫ్ పంటల సాగు సాధారణంగా జూన్ నుంచి ప్రారంభమై అక్టోబర్ వరకు కొనసాగుతుందని, వరి, మొక్కజొన్న, జొన్న, సజ్జ తదితర పంటలకు సమృద్ధిగా వర్షపాతం, సాగునీరు అవసరమవుతాయని తెలిపారు. ప్రతి జిల్లాలో నీటి లభ్యత ఆధారంగా ఇరిగేషన్ బోర్డు సమావేశాల్లో నీటి విడుదల తేదీలను ఖరారు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గోదావరి డెల్టా వ్యవస్థ (+ఋా) పరిధిలో ప్రస్తుతం 51.67 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని మంత్రి తెలిపారు. జూన్ 30 వరకు ఖరీఫ్ అవసరాలకు 38.52 టీఎంసీలు అవసరమవుతాయని, మిగిలిన 13.15 టీఎంసీలతో జూలై 14 వరకు సాగునీటి అవసరాలు తీర్చగలమని చెప్పారు. కాలువల మరమ్మతులు, సిల్టు తొలగింపు, కలుపు నివారణ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయని తెలిపారు. కాలువల అభివృద్ధి పనులు చేపట్టినందున మే చివరి వరకు పనులు పూర్తి చేసి జూన్ 1 నుంచి నీటి విడుదల ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కృష్ణా డెల్టా వ్యవస్థలో పులిచింతల ప్రాజెక్టులో ప్రస్తుతం 24.43 టీఎంసీల ప్రత్యక్ష నిల్వ ఉందని తెలిపారు. జూన్ నెల ప్రారంభ ఖరీఫ్ అవసరాలకు 18.22 టీఎంసీలు అవసరమవుతాయని చెప్పారు. తాగునీటి అవసరాలకు 4 టీఎంసీలు కేటాయించిన తర్వాత 2.21 టీఎంసీలు మిగులుతున్నాయని పేర్కొన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి ప్రస్తుతం అదనపు నీటి లభ్యత లేదని చెప్పారు. కాలువల నిర్వహణ పనులు మే 2 నుంచి ప్రారంభమయ్యాయని, జూన్ 1 నుంచి కృష్ణా తూర్పు డెల్టా, జూలై 1 నుంచి కృష్ణా పశ్చిమ డెల్టాకు నీటి విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పరిధిలో ప్రస్తుతం 9.22 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని మంత్రి తెలిపారు. సాగు పనులు జూన్ రెండో వారంలో ప్రారంభమవుతాయని, వరి నాట్లు జూలై రెండో వారంలో ప్రారంభమయ్యే అవకాశముందని పేర్కొన్నారు. ప్రస్తుతం కాలువల నిర్వహణ పనులు వేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు. కడప జిల్లాలోని ఐదు మధ్య తరహా ప్రాజెక్టుల్లో ప్రస్తుతం 3.905 టీఎంసీల నిల్వ ఉందని తెలిపారు. కాలువల వ్యవస్థ సక్రమంగా సిద్ధంగా ఉండడంతో మే 15 నుంచే నీటి విడుదలకు అవకాశం ఉందన్నారు.

# ఉత్తమ విద్యార్థినికి విభూతి సన్మానం



నవతరం -శ్రీకాకుళం

ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 594 మార్కులు సాధించిన దండి వీధికి చెందిన తేజ శ్రీ మరెన్నో విజయాలు సాధించాలని 31 డివిజన్ ఇన్‌చార్జ్, ఏపీ కనీస వేతన సలహా మండలి డైరెక్టర్ విభూది సూరిబాబు ఆకాంక్షించారు. అత్యధిక మార్కులు సాధించిన తేజ శ్రీ, తల్లితండ్రులు పీఎంపీ వైద్యుడు హరి, శకుంతలను ఆయన వారి నివాస గృహంలో కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థినిని అభినందిస్తూ ఉన్నత విద్యనభ్యశించి ఉన్నత స్థాయిలో నిలిచి తల్లిదండ్రులు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి, సంక్షేమం శర వేగంగా జరుగుతుందని, నియోజకవర్గం అభివృద్ధి పై ఎమ్మెల్యే గొండు శంకర్ దృష్టి సారించారని చెప్పారు. విద్యా వ్యవస్థ బలోపేతానికి విద్యా శాఖ మంత్రి లోకేష్ విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు.

# మానవ జీవితంలో..... గంగాస్నాన పుణ్యఫలం !





గంగా స్నానం సకల పాపాలను ప్రతికూల కర్మలను తొలగించి ఆధ్యాత్మిక పవిత్రతను మరియు మోక్షాన్ని ప్రసాదిస్తుందని హిందూ ధర్మంలో ప్రగాఢ విశ్వాసం.స్నానం చేయకపోతే ఆధ్యాత్మికమైన పూజలు జపం మొదలైనవి చేసుకోవడానికి వీలు లేదు పోగొట్టుకోవాలి అంటే చేయాలి. ఈ విధంగా స్నానానికి కనబడే ఫలం కనబడని ఫలం, ఉన్నాయి. స్నానం చేస్తే పై శరీరానికి చేస్తే లోపల శుద్ధి కలుగుతుంది వేదములో ఉంది. రూప, తేజస్సు, బలం, సౌచం, ఆయుషు, తపస్సు,ఆరోగ్యం, కోరికలు లేకపోవుట, చెడు
స్వప్న దోషం పోవుట, మేధా పెరుగుట అనే పది విధానాలు శాస్త్రాల్లో ఉన్నాయి. ఈ పవిత్ర నది స్నానం వల్ల శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత అశ్వమేధ యాగంతో సమానమైన పుణ్యఫలం లభిస్తుందని మనకు పురాణాలు చెబుతున్నాయి. గంగను స్మరించిన పునర్జన్మ బంధాల నుండి విముక్తి కలిగి మోక్షం లభిస్తుందని గంగా స్నానం వల్ల సకల శుభాలు కలుగుతాయని, కాశీ విశ్వనాథుని దర్శనానికి ముందు గంగా స్నానం ఆత్మను శరీరాన్ని సిద్ధం చేస్తుంది. హిందువుగా పుట్టినవాడు జీవితంలో ఒక్కసారైనా కాశీక్షేత్రాన్ని సందర్శించాలని మన పెద్దలు చెబుతుంటారు. కాశీ క్షేత్రాన్ని సందర్శించేందుకిప్పుడు రవాణా సౌకర్యం ఉండడంతో సునాయాసంగా వెళ్లి రాగలుగుతున్నాం. ఇంతకీ కాశీ క్షేత్రానికి అంత ప్రసిద్ధి ఎందుకువచ్చిందంటే, గంగమ్మ తల్లి ఉండటం వల్లనేనని తడుముకోకుండా ఎవరైనా సమాధానం చెబుతారు. కాశీకీ, గంగామాతకు ఉన్న అనుబంధం పురాణ ప్రసిద్ధమైనది. భారతీయ పుణ్యక్షేత్రాల జాబితాలో అగ్రస్థానంలో ఉన్న కాశీలో పితృకర్మలు నిర్వహిస్తే మంచిఫలితం ఉంటుందన్నది తరతరాలుగా మన నమ్మకం. కాశీలో ఉన్న అసిఘట్టం, దశాశ్వమేధ, ఆదికేశవ, పంచగంగ, మణికర్ణిక ఘట్టాలు పంచతీర్థ క్షేత్రాలుగా ప్రసిద్ధి చెందాయి. వీటిలో మణికర్ణలో పవిత్ర స్నానం చేస్తే సకల పాపాలు పరిహరమవుతాయని నమ్మకం. కాశీలో తుదిశ్వాస విడిచిన వారు బొందితో కైలాసానికి వెళ్తారన్న నమ్మకం కూడా ఉంది.

కార్తీకంలో కాశీదర్శనం ఎంతో పుణ్యప్రదం. కార్తీకమాసంలో గంగలో స్నానం చేసి విశ్వనాథునికి అభిషేకంచేస్తే మనిషిలో మాటలకు అందని మార్పు వస్తుందన్నదని కూడా మన వారి నమ్మకం. అన్నింటికీ నమ్మకమే ప్రధానం. విశ్వనాథుని ఆలయం గంగానదికి పశ్చిమాన మణికర్ణికా ఘట్టానికి సమీపంలో ఉంది. సుమారు 16 మీటర్ల ఎత్తున బంగారు గోపురం ఉన్న ఈ ఆలయం మొగలాయిల కాలంలో ముస్లింల దండయాత్రల్లో అనేకసార్లు దాడులకు గురైంది. ఔరంగజేబుకాలంలో ఈ ఆలయంలో సగం పడగొట్టించి జ్ఞానవాపి అనే మసీదులు నిర్మించారు. అదొక్కటే కాదు, మన రాష్ట్రంలోని చాలా పురాతన దేవాలయాలు మొగలాయిల కాలంలో స్థానభ్రంశం కావడమో, వాటి స్థానే మసీదులు ఆవిర్భవించడమో జరిగినట్టు చారిత్రక ఆధారాలున్నాయి. చరిత్ర ప్రసిద్ధి చెందిన రాజమహేంద్రవరంలో శ్రీవేణుగోపాలస్వామి ఆలయాన్నిందుకు ఉదాహరణగా చెపుతారు.
ఇలాంటివి మనదేశంలో ప్రతిప్రాంతంలో ఉన్నాయి. కాశీక్షేత్ర మహిమ గురించి చెప్పేందుకు వేయినోళ్ళు చాలవు. గంగానదీలో స్నానం చేస్తే దీర్ఘరోగాలు నయమవుతాయి. అలాగే, గంగాజలాలను చిన్న పాత్రలు, రాగి చెంబుల్లో తెచ్చుకోవడం, శుభకార్యల సమయంలో ఆ నీటిని ఇల్లంతా చిలకరించడం మన సంప్రదాయం. గంగకంత పవిత్రత ఉన్నందువల్లే శారీరక దుర్బలురు సైతం గంగా స్నానంచేయాలనీ, కాశీలో తుది శ్వాస విడనాలని కోరుకుంటూ ఉంటారు. పరమేశ్వరుని శిరస్సునుంచి మానవాళిని ఉద్ధరించేందుకే గంగానది భూమి మీదికి దిగి వచ్చిందని పురాణాలు చెబుతున్నాయి. విశాలాక్షీ సమేత కాశీ విశ్వేశ్వరని సందర్శన భాగ్యంతో పుణ్యగతలు పొందాలని కోరుకోనివారెవరు.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

# మీడియా స్వేచ్ఛపై దాడులు సహించం

- ఐఎఫ్‌డబ్ల్యుజే తీవ్ర ఆగ్రహం
- విజయనగరం జిల్లాలో జరిగిన ఘటన దారుణమన్న ఈశ్వరరావు
- మీడియా గొంతు నొక్కే ప్రయత్నాలు మానుకోవాలని మల్లేశ్వరరావు హెచ్చరిక

**నవతరం-శ్రీకాకుళం**

విజయనగరం జిల్లాలో చిన్నపత్రిక ఎడిటర్‌పై జరిగిన దాడిని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యుజే) రాష్ట్ర ఇంచార్జ్, జాతీయ కమిటీ సభ్యుడు ఎన్. ఈశ్వరరావు తీవ్రంగా ఖండించారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్న మీడియా ప్రతినిధులపై దాడులు జరగడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతమన్నారు.
ఉత్తరాంధ్ర రీజనల్ సమన్వయకర్త ఎం.వి. మల్లేశ్వరరావు మాట్లాడుతూ, విజయనగరం జిల్లాలో జరిగిన ఈ ఘటన అత్యంత దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతి, అక్రమాలపై వార్తలు రాస్తున్న జర్నలిస్టులను బెదిరించడం, దాడులకు పాల్పడడం అప్రజాస్వామిక చర్యలన్నారు. నిజాలు రాసినందుకే జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు.
ప్రజాస్వామ్యంలో మీడియా నాలుగో స్థంభమని చెప్పుకుంటూనే, మీడియా గొంతు నొక్కే ప్రయత్నాలు చేయడం తగదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నపత్రికలు ప్రజల సమస్యలను



ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, అలాంటి పత్రికల ఎడిటర్లపై దాడులు జరగడం ఆందోళనకరమన్నారు.
జర్నలిస్టుల భద్రతకు ప్రభుత్వం పూర్తి హామీ ఇవ్వాలని, ఘటనకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మీడియా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ప్రభుత్వంపైన ఉందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

# కలకత్తా కాళీమాత సాక్షిగా 'ది బెంగాల్ ఫైల్స్' బెంగాల్‌లో విడుదల

కలకత్తా కాళీమాత సాక్షిగా ది బెంగాల్ ఫైల్స్ బెంగాల్‌లో విడుదల వివాదాస్పద చిత్రం -ది బెంగాల్ ఫైల్స్- ఎట్టకేలకు ప్రభుత్వం మారిన తర్వాత బెంగాల్‌లో విడుదలకు సిద్ధమవుతోంది. గత ప్రభుత్వం ఈ సినిమాను విడుదల కాకుండా నిరోధించగా.. ఇప్పుడు కొత్తగా పగ్గాలు చేపట్టిన భాజపా ప్రభుత్వం సినిమా విడుదలకు మార్గం సుగమం చేసింది. వివేక్ అగ్నిహోత్రి తెరకెక్కించిన ఈ చిత్రం దేశవ్యాప్తంగా గతేడాదే విడుదలైనా.. బెంగాల్‌లో మాత్రం అడ్డంకులు ఎదుర్కొంది. చరిత్రలోని బెంగాల్ విభజన - ముస్లిం లీగ్ వివాదం వంటి సున్నితమైన అంశాలను స్పృశించడం వల్ల అప్పట్లో రాజకీయ ఒత్తిళ్లు ఈ సినిమా విడుదలను అడ్డుకున్నాయనే విశ్లేషణలు సాగాయి.
భారతీయ చలనచిత్ర రంగం ప్రస్తుతం రాజకీయ ఒత్తిళు .. సామాజిక వర్గాల ఆంక్షల మధ్య నలిగిపోతోంది. సెన్సార్ బోర్డ్ (సీబీఎఫ్‌సి) ఒక చిత్రానికి చట్టబద్ధమైన అనుమతిని ఇచ్చినా.. రాష్ట్ర ప్రభుత్వాలు శాంతిభద్రతల సాకుతో సినిమాలను నిలిపివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధంగా మారిందని విమర్శలొచ్చాయి. కళను కళగా చూడకుండా రాజకీయ రంగు పులిమి ఓటు బ్యాంకు ప్రయోజనాల కోసం వాడుకోవడాన్ని న్యాయ నిపుణులు -సాంస్కృతిక నియంతృత్వం-గా అభివర్ణిస్తున్నారు. ఇలాంటి నిర్ణయాలు రాజ్యాంగం కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛపై అనేక ప్రశ్నలను లేవనెత్తాయి.
రాజకీయ ఒత్తిళ్ల కారణంగా సినిమాలు ఆగిపోవడం వల్ల చిత్ర పరిశ్రమలో ఒక రకమైన గందరగోళం.. భయం నెలకొంటోంది. వాస్తవ రూపంలో ఉండే కథలను చెప్పడానికి దర్శకరచయితలు, నిర్మాతలు భవిష్యత్తులో వెనుకడుగు వేసే ప్రమాదం ఉంది. ఇది సృజనాత్మకతను చంపేసి.. కేవలం అధికార వర్గాలకు లేదా కొన్ని వర్గాలకు అనుకూలమైన కథలకే సినిమా రంగాన్ని పరిమితం చేస్తుంది. ఒక సినిమా చూసి అందులోని మంచి చెడులను విశ్లేషించుకునే విజ్ఞత ప్రేక్షకులకు ఉన్నా.. వారి తరఫున రాజకీయ పార్టీలే నిర్ణయాలు తీసుకోవడం వ్యక్తిగత స్వేచ్ఛను అవమానించడంగా పరిగణించాల్సి ఉంటుంది.
మరోవైపు డిజిటల్ యుగంలో -బాయ్‌కాట్- సంస్కృతి ఒక -అదృశ్య సెన్సార్‌షిప్-గా మారి వేధిస్తోంది. సామాజిక మాధ్యమాల్లో వ్యతిరేకత వస్తుందేమో అన్న భయంతో రచయితలు తమ కథల్లోని కీలక అంశాలను ముందే తొలగించుకునే స్వీయ సెన్సార్‌షిప్ వైపు మళ్లుతున్నారు. ఏదైనా ఒక సామాజిక వర్గం మనోభావాలు దెబ్బతింటాయేమో అనే భయం క్రియేటర్లను సంకెళ్లతో కట్టేస్తోంది. దీనివల్ల బాక్సాఫీస్ వద్ద వసూళ్లు దెబ్బతినడమే కాకుండా.. సినిమాపై ఆధారపడిన వందలాది కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయనే విశ్లేషణలు సాగుతున్నాయి. సోషల్ మీడియాలో పెరుగుతున్న ఈ తీవ్ర ధోరణులు ఆరోగ్యకరమైన చర్చకు బదులు ద్వేషపూరిత వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. భారతదేశం వంటి వైవిధ్యభరితమైన దేశంలో భిన్నమైన అభిప్రాయాలు ఉండటం సహజం.. కానీ ఏదో ఒక వర్గానికి నచ్చని అంశాలను పూర్తిగా తొలగించాలని పట్టుబట్టడం వల్ల -భిన్నత్వంలో ఏకత్వం- అనే సామాజిక సూత్రం దెబ్బతింటోంది. వ్యవస్థీకృతమైన ఈ బాయ్‌కాట్ ట్రెండ్స్ ప్రజాస్వామ్య విలువలకు పెద్ద సవాలుగా పరిణమించాయి. కళను రాజకీయాలకు అతీతంగా ఉంచినప్పుడే సమాజంలో ఆరోగ్యకరమైన మార్పులు సాధ్యమవుతాయి. వివాదంతో ముడిపడిన అంశం:
-ది బెంగాల్ ఫైల్స్- చిత్రం ప్రధానంగా 1946 నాటి



కలకత్తా అల్లర్లు, బెంగాల్ విభజన సమయంలో జరిగిన హింస .. నాటి రాజకీయ పరిణామాలను ఇతివృత్తంగా తీసుకుని తెరకెక్కించారు. చారిత్రక వాస్తవాలను వెలికితీసే సాకుతో ఈ సినిమా గతంలోని ముస్లిం లీగ్ పాత్రను .. సున్నితమైన మతపరమైన అంశాలను ప్రత్యక్షంగా ప్రస్తావించడం తృణమూల్ కాంగ్రెస్‌కు రాజకీయంగా పెద్ద చిక్కులు తెచ్చిపెట్టిందనే చర్చ సాగింది. పశ్చిమ బెంగాల్‌లో బలమైన ముస్లిం ఓటు బ్యాంకును కలిగి ఉన్న టీఎంసీ ఈ చిత్రం మతపరమైన ఉద్రిక్తతలను పెంచి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తుందని... అలాగే తమ ప్రభుత్వ లౌకిక ఇమేజ్‌ను దెబ్బతీసేలా ఒక నిర్దిష్ట వర్గాన్ని లక్ష్యం చేసుకుందని ఆందోళన చెందింది.
ఈ సినిమాలోని అంశాలు ప్రజల్లో భావోద్వేగాలను రగిల్చి... ప్రత్యర్థి పార్టీ అయిన బీజేపీకి రాజకీయంగా మైలేజీ ఇచ్చే అవకాశం ఉండటమే తృణమూల్ కాంగ్రెస్ ఈ చిత్ర విడుదలను తీవ్రంగా వ్యతిరేకించడానికి ప్రధాన కారణం అన్న చర్చా సాగింది.

# అస్పృశ్యత పై పోరాటానికి గాంధీజీ 21 రోజుల నిరాహారదీక్షకు 93 ఏండ్లు...

- ఏడాదిపాటు పర్యటనలు, చర్చ, సామాజిక చైతన్యానికి పిలుపు...
- శాశనోల్లంఘన ఉద్యమం ఆరు వారాలు నిలుపుదల
- కాంగ్రెస్ పార్టీలో భిన్న స్వరాలు- గాంధీజీ బేఖాతరు ...

భారత స్వాతంత్ర్య సమరంలో శాశనోల్లంఘన ఉద్యమం ఉధృతంగా సాగుతున్న రోజులవి. గాంధీజీ తో పాటు పలువురు జాతీయ నేతలను బ్రిటిష్ ప్రభుత్వం పూనె లోని ఎరవాడ జైలులో నిర్బంధించారు. జైలు జీవితం గడుపుతున్న గాంధీజీ అనూహ్యంగా ఓ నిర్ణయం తీసుకున్నారు. 1933 మే 8 నుండి 21 రోజుల పాటు తాను స్వీయ శుద్ధీకరణ (ఆత్మ శుద్ధి) పేరుతో నిరాహారదీక్ష చేస్తున్నట్లు ప్రకటించారు. భారత మాతకు అవమానకరంగా భావిస్తున్న అమానుషమైన అస్పృశ్యతా దురాచారంపై పోరాటానికి, ఈ దిశగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు, తద్వారా ప్రజలను చైతన్య పరచి భారత దేశంలో అంటరానితనం నిర్మూలనకు తాను ఈ దీక్ష చేపడుతున్నట్లు గాంధీజీ ప్రకటించారు. శాశనోల్లంఘన ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో దానిని ఆరు వారాలు నిలుపుదల చేసి సామాజిక రుగ్మతలపై దృష్టి మరల్చడాన్ని కాంగ్రెస్ శ్రేణులు అభ్యంతరం చెప్పారు. అయినా, గాంధీజీ నిరాహారదీక్ష కొనసాగించారు. ఆయన ఆరోగ్యం క్షీణించడంతో జైలు నుండి విడుదల చేసారు. జైలు నుండి విడుదలైనా ఆయన 21 రోజుల పాటు దీక్షను కొనసాగించారు.

జాతీయ నాయకులు దేశవ్యాప్తంగా పర్యటించి సమావేశాలనేర్పాటుచేసి అస్పృశ్యత పై చర్చించి ప్రజలను చైతన్యవంతులను చేయాలని, అస్పృశ్యత లేని సమ సమాజం కోసం కృషి చేయాలని గాంధీజీ పిలుపునిచ్చారు. అస్పృశ్యతను అమానవీయంగా ప్రజలు గుర్తించారు. గాంధీజీ సూచించినట్లు ఆరు మాసాల విరామం తర్వాత శాశనోల్లంఘన ఉద్యమం ఉధృతంగా కొనసాగింది. భారత స్వాతంత్ర్య సమరంలో ఓ వైపు ఉద్యమం కొనసాగిస్తూనే , సామాజిక అసమానతలపై పోరాటాలు, భవిష్యత్ కార్యాచరణ, ఎత్తుగడలు, వ్యూహాల రచన సాగుతుండేవి. 93 ఏండ్ల క్రితం భారతావని ఉజ్వల భవిష్యత్తుకై గాంధీజీ ఆలోచనలు, ఆచరణ , సామాజిక స్పృహ అభినందనీయం. నిత్య స్మరణీయం.

చౌధరి రాధాకృష్ణ, గాంధేయవాది, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, శ్రీకాకుళం.

# 23 మంది పారిశుధ్య కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



**నవతరం-శ్రీకాకుళం**

జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని ప్రశ్నించిన 23 మంది పారిశుధ్య కార్మికులను ఎటువంటి ముందస్తు నోటీసులివ్వకుండా మార్చి 8 నుంచి డ్యూటీ లను అర్ధాంతరంగా ఆపేసిందని ఇఫ్టూ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. 23 మంది పారిశుధ్య కార్మికులను విధుల్లోకి రాకుండా నిలుపుదల విషయమై లేబర్ కోర్టు లో కేసులు వేశామని, కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలన్న ఆదేశాలను అమలు చేయాలని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఇచ్చిన డైరెక్షన్ అమలు చేయాలని రిమ్స్ సూపరింటెండెంట్ , మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసు లిమిటెడ్ యాజమాన్యానికి ఇఫ్టూ ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ జిల్లా కార్యవర్గ సభ్యురాలు సవలాపురపు కృష్ణవేణి మాట్లాడుతూ, జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని అడిగినందుకు అక్రమంగా పనులకు రాకుండా నిలుపుదల చేసిన 23 మంది పారిశుధ్య కార్మికులను డ్యూటీ లోకి తీసుకోవాలని, రిమ్స్ అధికారులు పారిశుధ్య కార్మికులకు అండగా నిలవాలని, క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసు లిమిటెడ్ యాజమాన్యంతో మాట్లాడి డ్యూటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అక్టోబరు నుంచి ఏప్రిల్ నెల వరకు చెల్లించాల్సిన వేతనాలు విడుదల చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో దమ్ము చిన్నారావు, సాదు శ్రీనివాస్, కొప్పుల భాస్కరరావు, కొప్పుల ఇల్లమ్మ, దమ్ము పద్మ, పోలమ్మ, పద్మ, కొప్పుల నీలవేణి, సూరాడ సర్వసతి, రాయితి పార్వతి, దుండగండి వెంకటరమణ, అడపా అప్పలనాయుడు, కొప్పల కృష్ణకుమారి, ఎం భూదేవి తదితరులు పాల్గొన్నారు.

# రాజాంలో ఘనంగా ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం నిర్వహణ

## సేవా భావమే రెడ్ క్రాస్ లక్ష్యం

### నాయకులు



**నవతరం-రాజాం**

ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాజాం శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)లో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. యూత్ రెడ్ క్రాస్ విభాగం ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు సర్ జీన్ హెన్రీ డ్యునెంట్ చిత్రపటానికి రెడ్ క్రాస్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాజాం శాఖ చైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్ కుమార్, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్య కుమార్ మాట్లాడుతూ, హెన్రీ డ్యునెంట్ సేవా స్ఫూర్తితో రాజాం ప్రాంతంలో రెడ్ క్రాస్ సంస్థ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. రక్తదానం, నేత్రదానం, అవయవదానం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పంపిణీ, ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులకు సహాయం వంటి కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నామని పేర్కొన్నారు.

అలాగే పాఠశాలలు, కళాశాలల్లో జూనియర్ రెడ్ క్రాస్, యూత్ రెడ్ క్రాస్ విభాగాల ఏర్పాటు ద్వారా విద్యార్థుల్లో సేవా భావన పెంపొందిస్తున్నామని తెలిపారు.

రానున్న రోజుల్లో రెడ్ క్రాస్ సేవలను మరింత విస్తరించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, సమాజంలో సాటి వారికి సహాయపడే దృక్పథాన్ని అలవరుచుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో విశాఖపట్నం రెడ్ క్రాస్ ప్రతినిధి మహదాశ్రమం నర్సరాజు, బి.వి. అచ్యుత కుమార్, పెంకి గౌరీశ్వరరావు, పోలాకి ఈశ్వరరావు, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ బి. భాస్కరరావు, టి.ఓ. ఎన్. లక్ష్మణరావు, మండల చైతన్య, కోళ్ళ యశస్సు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ సేవలకు నంది ఉమాశంకర్‌కు సన్మానం

## సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ప్రశంసలు




**నవతరం-శ్రీకాకుళం**

ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాల్లో విశేషంగా పాల్గొంటున్న రెడ్ క్రాస్ ప్రతినిధి నంది ఉమాశంకర్‌ను ఘనంగా సన్మానించారు.

రక్తదానం, సేవా కార్యక్రమాలు, సమాజ సేవలో అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ సన్మానం నిర్వహించారు. శ్రీకాకుళం డి.ఆర్.ఓ విశ్వేశ్వరరావు, రెడ్ క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, ట్రెజరర్ దుర్గా శ్రీనివాస్, సెక్రటరీ మల్లేశ్వరరావు, డా. మూలా వెంకటరావు, డా. గొండు గంగాధరరావు, డా. వండాన సచిత్ర చేతుల మీదుగా ఆయనకు ప్రశంసాపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా నంది ఉమాశంకర్ మాట్లాడుతూ, రెడ్ క్రాస్ ద్వారా సమాజ సేవ చేసే అవకాశం రావడం తన అదృష్టమని అన్నారు. ఈ గుర్తింపు తనలో మరింత సేవాభావాన్ని పెంపొందించిందని, భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాల్లో మరింత చురుకుగా పాల్గొంటానని తెలిపారు.

తనను ప్రోత్సహించిన రెడ్ క్రాస్ సభ్యులు, మిత్రులు, సహచరులకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే కూన రవికుమార్
- ఆమదాలవలసలో

ప్రజా దర్బార్ నిర్వహణ



**నవతరం-ఆమదాలవలస**

ఆముదాలవలస పట్టణంలోని CVAP కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆముదాలవలస శాసనసభ్యులు, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ ప్రజల నుండి వినతులు స్వీకరించారు.

ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలు, వినతులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుండి వచ్చిన పలు వినతులను శ్రద్ధగా ఆలకించిన ఎమ్మెల్యే కూన రవికుమార్ సంబంధిత శాఖల అధికారులతో వెంటనే మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ముఖ్యంగా తాగునీరు, పారిశుద్ధ్యం, రోడ్లు, విద్యుత్, పింఛన్లు, గృహ నిర్మాణం వంటి ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజా దర్బార్ ద్వారా నేరుగా ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించడమే కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రతి వినతిపై బాధ్యతాయుతంగా స్పందించి ప్రజలకు న్యాయం జరిగేలా అధికార యంత్రాంగం పనిచేయాలని స్పష్టం చేశారు.

# 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 'కాంతి రేఖ అవార్డ్స్'



**నవతరం-శ్రీకాకుళం**

స్థానిక పీఎస్ఎన్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ లో కాంతిరేఖ అవార్డ్స్ ప్రదానోత్సవ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.దేవదత్తానంద్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. మార్చి 2026లో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ ఏడు హై స్కూల్స్‌తోపాటు మునసబుపేట గాయత్రి హైస్కూల్ మొత్తం ఎనిమిది హైస్కూల్స్‌లో ప్రతి హైస్కూల్‌లో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ. పదివేలు, రెండో ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.ఐదువేల వంతున కాంతి రేఖ అవార్డ్స్ ను తమ కుమార్తె పెండ్యాల కాంతిరేఖ (జననం24-7-1995, మరణం 21-12-2025) పేరిట విశ్రాంత ఉపాధ్యాయుడు పెండ్యాల సత్యనారాయణ ప్రసాద్, రాధాకృష్ణవేణి దంపతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీకాకుళం డివిజన్ ఉప విద్యాశాఖాధికారిణి ఆర్.విజయకుమారి హాజరై అవార్డ్స్ నగదు చెక్కులను విద్యార్థులకు అందజేశారు. ఆమె కాంతిరేఖ విషయమై మాట్లాడుతూ, "కాంతి రేఖ చదువుల తల్లి అని, కంటి చూపు ఇబ్బంది ఉన్నా 10వ తరగతిలో ఎ వన్ గ్రేడ్, ఇంటర్మీడియట్ ఎంపీసీ చదివి ప్రతిభ అవార్డు రూ.50 వేలు, బి ఫార్మసీ ఫస్ట్ క్లాస్ విత్ డిస్టెన్సన్ జేఎన్టీయూ కాకినాడ, ఎంబీఏ ఫస్ట్ డివిజన్ ఆంధ్రా యూనివర్సిటీ, ఎంఏ(ఇంగ్లీష్) ఫస్ట్ డివిజన్ ఆంధ్రా యూనివర్సిటీ, ఎల్వీ ప్రసాద్ విజన్ రిహాబిలిటేషన్ సెంటర్లో కంప్యూటర్ ట్రైనింగ్ స్వయంకృషితో సాధించిందని, కాంతిరేఖ స్ఫూర్తితో విద్యార్థులంతా కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హై స్కూల్ అరసవిల్లి నుంచి పి.సత్య ఇందు(591), పి.రేణుక(572), వరం మున్సిపల్ హై స్కూల్ గుజరాతిపేట నుంచి వై.జ్ఞాన ప్రసన్న(588), కె.హేమలత (585), పీఎస్ఎన్ మున్సిపల్ హై స్కూల్ నుంచి కె.లాస్య(563), వి. భార్గవ్ కృష్ణ (554), టీపీఎం హైస్కూల్ నుంచి బి.నూకరాజు(561), ఎం.పూజ (555), మున్సిపల్ హై స్కూల్ బలగ నుంచి జె.రోహిత్(561), వై.కృపారాణి (554), తదితరులు కాంతిరేఖ పేరిట నగదు ప్రోత్సాహక బహుమతులు పేద మెరిట్ విద్యార్థులకు అందజేసిన కాంతి రేఖ తల్లిదండ్రులైన సత్యనారాయణ ప్రసాద్, రాధాకృష్ణ వేణిని అభినందించారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**